# సంసారంలో సరిగమలు

భారంగా, మెల్లగా నడచి వస్తున్న మంజులను కళ్ళు విప్పార్చి చూశాడు గోపాలం.

అడుగులో అడుగు వేసుకుంటూ మంచందగ్గరకు వచ్చింది మంజుల.

"కూర్చో! మంజూ!" తన ప్రక్కనే మంచంమీద చోటు చూపించాడు గోపాలం.

"మీ వంట్లో ఆరోగ్యంగా వుంటున్నదా?" ప్రశ్నించింది మంజుల తన ప్రక్కనే మంచం మీద కూర్చుంటూ.

"నా ఆరోగ్యానికేం విశేషంలా వుంది! నీ వంట్లో కులాసాగా వుంటున్నదా? ఆమె ముంగురులు నిమురుతూ- ఆప్యాయంగా అడిగాడు గోపాలం.

ఆమె తల వూపింది-

నిన్నుచూసి రెండు నెలలయిందేమో - యిప్పుడు నీకు తొమ్మిదో నెల కదూ!" అడిగాడు గోపాలం - ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

"అవును! ఒకవారం రోజుల్లో.... డెలివరీ అవుతుందని చెప్పింది డాక్టర్!" తలవంచుకుని అన్నది మంజుల.

"ఊఁ! ఈసారి ఎవరని చెప్పింది - కూతురా, కొడుకా?"

మూతి విచిత్రంగా ముడిచి - ముసి ముసి నవ్వులు నవ్వుకుంది మంజుల. గోపాలానికి ఆ పోజంటే మహా ఇష్టం!

తన చూపుడు వేలితో ఆమె చుబుకాన్ని పైకెత్తి - ఆమె కాటుక కళ్ళ మీద సున్నితంగా ముద్దుపెట్టుకున్నాడు.

"నాన్నా! నాన్నా! మరే! అంటూ వచ్చాడు రెండో కొడుకు సుబ్బారావు.

వాడివెనకాలే మూడోవాడూ, నాలుగోదీ వచ్చి గోపాలాన్ని చుట్టుముట్టేరు.

మంజుల వేపు ఒకసారి ఇబ్బందిగా చూసి- పిల్లల్ని దగ్గరకు తీసుకున్నాడు గోపాలం. "ఏంరా! తులసి ఏదీ?" అంటూ—

తులసి. గోపాలంకి వున్న నలుగురి సంతానంలోనూ పెద్దది. రెండోవాడు సుబ్బారావ్. మూడోవాడు రాంబాబు, నాలుగోది రమ.

"తులసి శర్మగారింట్లో ఆడుకుం

టున్నవి నాన్నా! పిల్చుకొస్తానుండు!" రాంబాబు హడావిడిగా బయటకు పరుగెత్తాడు.

విమలని ఒళ్ళోకి తీసుకుని ముద్దులాడేడు గోపాలం. తను తెచ్చిన బిస్కెట్ల పాకెట్ అందించాడు.

"నాన్నా! నాకో!" అన్నాడు రెండోవాడు. అంటూనే విమల చేతిలో వున్న పాకెట్ లాక్కుని పారిపోయాడు.

విమల ఏడుపు లంకించుకున్నది.

"ఉండు విమలా ఏడవకు! నీకా పాకెట్ యిప్పిస్తాగా!" మంజుల, విమలని లాలించింది.

## సత్యం ముందు పాటి

ఇంతలో పెద్ద పిల్ల తులసి. రెండో వాడి కాలర్ పట్టుకుని లాక్కొచ్చింది. "నాన్నా! వీడు చూడు!" అంటూ—

గోపాలం పాకెట్ తీసుకుని. మంజుల చేతికి అందించాడు.

మంజుల బిస్కెట్స్‌ని నాలుగు భాగాలుచేసి నలుగురికీయిచ్చింది.

బిస్కెట్స్ తీసుకొని పిల్లలు బయటకు వెళ్ళిపోయారు.

మంజులను దీక్షగా చూశాడు గోపాలం.

అందమైన ఆమె బుగ్గలలో పూర్వపు మెరుపులేదు. చక్కటి ఆమె నయనాల క్రింద నల్లని వలయాలు ఏర్పడ్డాయి! ఆమెలో, పెళ్ళయిన క్రొత్తలోవున్న చలాకీ తనం అసలేదు! దాని బదులు ఎక్కడిదో గంభీరత్వం వచ్చిపడింది.

"మంజూ! నా కిదేం నచ్చలేదు!" అన్నాడు గోపాలం వున్నట్టుండి.

"ఏది!" అడిగిందామె వులిక్కిపడుతూ.

"అదే! ముందిది చెప్పు! నీ కిప్పుడెన్నేళ్ళు!"

"ఇంకా ముసలిదాన్ని కాలేదులెండి! అయినా శ్రీవారికి ఆదేం అనుమానం! వస్తున్న నవ్వును- పంటిక్రింద నొక్కిపెడుతూ అన్నది మంజుల.

"అదికాదు- నీకింకా సరిగ్గా పాతికేళ్ళు నిండలేదు- అయినా నలుగురి పిల్లల తల్లి వయ్యావు! నాకు యింకా ముప్ఫయ్ ఏళ్ళు రాలేదు. అప్పుడే...." ఆగాడు గోపాలం- ఆమె కళ్ళల్లోకి పూర్వపు వెలుగును వెతుకుతూ.


"ఊఁ!" అన్నది మంజుల ఏమీ అర్థం కాక.

"నే చెప్పేది పూర్తిగా అర్థం చేసుకో మంజూ!
నువ్వు మరీ చిన్నదానివేం కాదు- పైగా చదువుకున్నదానివి...." మంజులచేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు గోపాలం.

ఆమెకంతా అర్థమయింది! కాని- ఏమీ మాట్లాడలేదు.

గోపాలమే మళ్ళీ అన్నాడు.

"యింతటితో పిల్లల్ని ఆపేద్దాం. ఈసారి కాన్పుకాగానే ఆపరేషన్



చేయించుకో. నిన్న- ఈ వయసు లోనే- నలుగురి పిల్లల తల్లిగా వూహించుకుంటుంటే ఏమిటోగా వుంది. పైగా ఈ కాన్పులతో- నువ్వా నీ ఆరోగ్యం- ఏమవుతుందో చెప్పినా నీ కర్థం కావటంలేదు. యింతటితో ఫుల్‌స్టాప్ పెట్టేద్దాం. ఏం. నాలుగు ప్లస్ వన్- అయిదుగురు పిల్లలు చాలరూ." లాలింపుగా అన్నాడు గోపాలం.

"నాన్న, అమ్మ అనరేమాత్రం వప్పుకోవటంలేదు. వాళ్ళకి యిదో మహాపరాధంలా, ఘోరమైన పాపంలా కనపడుతున్నది. మొన్న నేనీ మాట అమ్మతో అన్నానని ఆవిడ కళ్ళనీళ్ళు పెట్టుకుంది." ఒక్కక్షణం ఆగి తనే అడిగింది మంజుల "అత్తగారూ, మామగారూ ఏమంటున్నారు." అని.

"ఏమంటారు. నేను ఆ ఊరికి వెళ్ళినప్పుడల్లా ఇదే ప్రసంగం వచ్చేది. ఈసారికి వద్దులేరా. వచ్చేసారికి చూద్దాంలే అంటాడు నాన్న. అమ్మేమో ఇదంతా మన వినాశానికే వచ్చిందంటుంది.

మనం ముందు, యిద్దరితో ఆపేద్దా మనుకున్నాం. మానాన్న బలవంతం మీద మూడు అనుకున్నాం. తరువాత మీ వాళ్ళు అల్లరిచేస్తే నలుగురయారు. ఇప్పుడు అయిదు! ఇంతటితో ఆపక పోతే లాభం లేదు మంజూ! మన ఆరోగ్యం సంగతెలావున్నా ఈ కాల పరిస్థితులను బట్టి - అయిదుగురు పిల్లలను పెంచి, పెద్ద చేయటం, సామాన్యమైన విషయంకాదు! నామాటవిను-డెలివరి అవగానే - ఆపరేషన్ చేయించుకో - ఏమీ ప్రమాద ముండదు!"....ఆమె చేతిని మృదువుగా నొక్కుతూ అన్నాడు గోపాలం.

"నాకూ అన్నీ తెలుసు! కాని ఏం చేయమంటారు చెప్పండి! ఎవ్వరికీ ఈ విషయం నచ్చలేదు. అమ్మ, నాన్న అత్తగారు, మామగారు అందరూ కారాలూ, మిరియాలూ నూరుతున్నారు-" తన అసహాయతను వెలిబుచ్చింది మంజుల-

"మంజూ: వాళ్ళు యిప్పుడు ఎన్నన్నా-పిల్లల్ని పోషించవలసింది మనం. తరువాత ఏమనుకొని ప్రయోజనం లేదు! బాగా ఆలోచించు!"....

మామగారిని వరండాలో చూసి బయటకు వచ్చాడు గోపాలం.

"ఏమోయ్! ఎప్పుడు రావటం!" అడిగారు మామగారు.

"ఒక అరగంట అయిందండీ! వాళ్ళ సెలవు దొరకలేదు-సాయంత్రానికి వెళ్ళిపోవాలి!"

"మీ అమ్మా, నాన్న దగ్గర్నించి వుత్తరాలు వస్తున్నాయ్యా!"

"ఊఁ!" అన్నాడు గోపాలం, తల ఆడిస్తూ!

భోజనాలు చేయటం అయిపోయాక పిచ్చాపాటీ మాట్లాడుతున్నప్పుడు అన్నాడు గోపాలం-

"ఈసారి కాన్పు రాగానే - మంజులకు ఆపరేషన్ చేయిస్తే బాగుంటుందని నా అభిప్రాయం!"

"ఎందుకోయ్! ఐదుగురు పిల్లలకే ఏమంత మించిపోయిందని - అయినా డబ్బులు సంపాదించుకుంటున్నావ్! నీకేమోయ్? ఏదో - అడుక్కుతినే వాళ్ళకి కాని ఫామిలీప్లానింగ్!..."

"లేదు మామగారూ! నేను గట్టిగా నిశ్చయించుకున్నాను. యిక యింతటితో పిల్లలక్కర్లేదని!" సూటిగా అన్నాడు గోపాలం.

ఆయన ఒక్క నిముషం ఏమీ మాట్లాడలేదు.

"అసలు విషయం చెబుతున్నాను వినవోయ్ గోపాలం! పుట్టిన పిల్లను చంపితే ఎంత పాపమో-పుట్టబోయే పిల్లల్ని చంపినా అంతే పాపం! పోత పరకం ప్రాప్తిస్తుంది-వాడికి పుట్టగతులుండవ్! ఏ శాస్త్రమూ దీనికి ఒప్పుకోదు!-పిల్లలు భగవంతుని స్వరూపాలోయ్! అటువంటి వాళ్ళని చేజేతులా

నాశనం చేస్తావా! అది చాలా తప్పు! నువ్వింకా కుర్రవాడివి - యింకోసారి సరిగ్గా ఆలోచించు!"

"అది కాదండీ! నాకు వచ్చే రెండొందల యాభై జీతంతో - ఇంత మందిలో ..." వణికాడు గోపాలం.

"ఏమిటోయ్! నువ్వు మరీనూ! నారు పోసినవాడు నీరు పోయక మానడు! నువ్వు మీ నాన్నకు ఏడో వాడివి! ఆయన నిన్ను పెంచలేదూ! యింతవాణ్ణి చేయలేదూ! ఆయనకు మాత్రం ఏముంది కనక! ఆయనే ఆ రాజా నలుగురితో సరిపెట్టుకుంటే నువ్వేమయే వాడివి?.... అసలా విషయం అనుకోవటం కూడా మంచిదికాదు!" అన్నాడాయన.

గుమ్మంలో నుంచున్న అత్తగారు అందుకున్నది-

"ఈమధ్యనే రాజేశ్వరమ్మగారి పెద్ద కూతురు ఆపరేషను చేయించుకుంది. నిద్రపోతూ. ఏం ఆపరేషన్ చేశారో ఏమో పాపం దీపంలాంటి యిల్లాలు. నూరేళ్ళు నిండిపోయాయ్! ఎందుకు చెప్పు, లేనిపోని గొడవలు తెచ్చుకోవటం! సుభద్రమ్మగారి మూడో కూతుర్కి అంతే..."

"ఊఁ! చాల్లే ఊరుకో...." చిన్నగా కసిరాడు గోపాలం మామగారు.

గోపాలం ఆలోచనలో పడ్డాడు. ముద్దమందారంలా వుండే మంజుల- కాన్పులతో నీరసించిన మంజుల- అతని మస్తిష్కంతో మెదలసాగింది. ఏవో ఒకటి రెండు ఆపరేషన్సు ఫెయిలయితే - అన్నీ ఫెయిలవుతయ్యా! ఏమో! ఆపరేషన్ చేయిస్తే మంజుల తనకి దక్కుతుందా?-భయంతో వణికిపోయాడు గోపాలం.

"మొన్న-మీ అమ్మా నాన్నా ఇక్కడికి వచ్చినప్పుడు కూడా ఈ విషయం మీకు చర్చ జరిగిందోయ్ గోపాలం. వాళ్ళకి ఏ మాత్రం యిష్టంలేదు. ఇంత మంది యిష్టానికి వ్యతిరేకంగా నడుచుకుంటాననటం భావ్యంకాదు. అంతే కాక కుటుంబ నియంత్రణాన్ని ఏమతమూ, శాస్త్రమూ హర్షించదు!"- సరిగ్గా ఆలోచించుకో! తొందర పడితే తరువాత విచారించవలసి వస్తుంది!" అన్నాడాయన.

గోపాలానికి ఏం చేయాలో, ఏమనాలో అర్థం కాలేదు.

గదిలోకి వచ్చాడు గోపాలం. పిల్లలంతా ఆడుకోటానికి వెళ్ళారులా వుంది, ఆఖరిది విమల మాత్రం మంచంమీద పడుకుని. నిద్రపోతూ వుంది. నిద్రలో అమాయకంగా తనలో తనే నవ్వుకుంటున్నది ఎందుకో. మెరుస్తున్న పచ్చటి బుగ్గల్లోని పసిడి అందం, పసితనం తనని వెక్కిరిస్తున్నట్టు ఫీలయాడు గోపాలం. కూతురు ప్రక్కనే పడుకుని ఆమెమీద చేయివేసి ఆలోచించసాగాడు.

కొంతసేపయిన తరువాత వచ్చింది మంజుల. ఆమె నడకలో తనకు కావ

లపిన కొత్త పెళ్ళికూతురి హొయలు కనిపించలేదు. "ఎందుకు కనుపిస్తుంది?" కసిగా అనుకున్నాడు గోపాలం....


"ఏమిటి? కూతురి మీద ఒక్కసారిగా యింత ప్రేమ వచ్చేసింది. కావలించుకు పడుకున్నారు!" అన్నది మంజుల నవ్వుతూ.

గోపాలం ముఖం నల్లబడింది.

"నేను ఫామిలీప్లానింగ్ అప్లయి చేద్దామన్నానని-నాకు పిల్లలమీద ప్రేమ లేదనుకున్నావా మంజూ!-నేను మీరనుకునేంత కసాయివాడి నేమీ కాదు - నాకూ ప్రేమించే హృదయముంది-నేను పరిస్థితుల దృష్ట్యా మాట్లాడేనేకాని - పిల్లల మీద ప్రేమ లేక కాదు —" నిష్ఠూరంగా అన్నాడు గోపాలం.

మంజుల కళ్ళల్లో నీళ్ళు తిరిగినయ్!

"ఛా! అదేమి లేదండీ! నేనేదో సరదాకన్నాను! మీ మనసు నాకు తెలీదూ - మిమ్మల్ని నొప్పించాలని నే ననలేదు - "నొచ్చుకున్నది మంజుల.



గోపాలానికి తెలుసు ఆమెది ఎంత సున్నిత హృదయమో-

ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

"మంజూ నేనొక టడుగుతాను - చెబుతావా ?"

ఆమె అతని కళ్ళల్లోకి చూసింది.

"మనం పిల్లల్ని యింతటితో ఆపేయటం నీ కిష్టమేనా ?" సూటిగా అడిగాడు గోపాలం.

"మీ యిష్టమే నా యిష్టం !" అన్నది ముద్దరాలు - ముద్దగా.

"కాదు నీ అభిప్రాయం చెప్పు !"

ఒకసారి భర్తనుచూసి, తలదించుకుంది.

"పిల్లలు కావాలని ఏ తల్లి కోరుకోదూ - అయినా పదిమంది పిల్లల్ని కని, పెంచే తాహతులేక, పదిమందీ "ఆకలో" అని ఆవురావురుమంటుంటే ఏ మాతృమూర్తి సహిస్తుంది. మన సంసారం యిప్పుడు ఏ రకంగా నడుస్తున్నదో నాకు తెలుసు. అందుకే నాకేమీ అభ్యంతరం కనిపించటం లేదు !" - కాని నాన్నకీ అమ్మకీ అత్తగారికి - మామగారికి - అసలు మనవాళ్ళెవరికీ యిష్టంలేదు-అందర్నీ కాదని .... నెమ్మదిగా అన్నది మంజుల.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను !" అన్నాడు గోపాలం.

ఉన్నట్టుండి గోపాలం అన్నాడు.

"సరేలే ! యిప్పటినుంచీ మనసులు పాడుచేసుకోవటం ఎందుకు ? తరువాత ఆలోచిద్దాం ! ఇంతకీ మనకి పుట్టబోయే వాడికి పేరేం పెడదాం!" అడిగాడు గోపాలం.

"వాడు, కాదు ! మనకి అమ్మాయి పుడుతుంది !" అన్నది మంజుల కవ్విస్తూ.

"సరే ఎవరయితేనేం ! యిప్పుడున్న నలుగురికీ తాతల పేర్లూ, అమ్మమ్మ పేరూ, నాయనమ్మ పేరు పూర్తయినయ్ ! యిక పేరు పెట్టమనే చుట్టా లెవరూ లేరుకదా !" అడిగాడు గోపాలం నవ్వుతూ.

"ఫన్నా. మనం మంచి పేరు ఆలోచించి పెడదాం లెండి!"

"సరే ! మంచి తెలుగు పేరు చెప్పు - బెంగాలీపేర్లూ అవీ అసలే వద్దు !"

"మీరే చెప్పండి ! నేను సెకండ్ చేస్తాను !"

"వద్దు ! నువ్వే ప్రపోజ్ చేయి-నేనే సెకండ్ చేస్తాను !"

కొంచెం ఆలోచించింది మంజుల.

"సీత !" అన్నది హఠాత్తుగా.

"గుడ్ ! నూటికి నూరుపాళ్ళు తెలుగుపేరు చెప్పావ్. నేనూ ఆ పేరే ఆలోచిస్తున్నాను. ముద్దబంతి పువ్వులోనూ, సంక్రాంతి గొబ్బెమ్మలోనూ హరిదాసు కీర్తనలోనూ వున్నంత తెలుగుతనం వున్న పేరది - నేను సెకండ్ చేయటానికి సిద్ధమే !" నవ్వాడు ఆమె భుజం నొక్కుతూ.

సెలవులేదు కనుక ఆ సాయంత్రమే వెళ్ళిపోయాడు గోపాలం.

తరువాత పదిరోజులకి - తను అన్నట్టుగానే ముద్దబంతి పువ్వులాంటి కూతుర్ని కన్నది మంజుల.

"సీత పుట్టింది !" అనుకున్నారు మిగిలిన పిల్లలు.

గోపాలానికి ప్రత్యుత్తరం వ్రాశారు. పదకొండో రోజుకి ముందే రమ్మని.

పదో రోజు కల్లా అంతా వచ్చారు. కానీ గోపాలం రాలేదు.

"అమ్మాయికి ఆపరేషన్ చేయించటంలేదని వ్రాయటంవలన కోపం వచ్చిందేమో అల్లుడికి" అన్నాడు మామగారు - గోపాలం తండ్రితో.

"ఎంత కోపమొచ్చినా - కనీసం పసిగుడ్డును చూసుకోటానికయినా, రానక్కరలేదుటమ్మా మరీ చోద్యం!" అనుకున్నారు ఆడవాళ్ళు.

పదకొండో రోజుకికూడా గోపాలం రాలేదు! ఉత్తరం వచ్చింది! బారసాల ఇరవై ఒకటిన చేయమని? అప్పుడు తను వస్తానని వ్రాసాడు.

"గుడ్డిలో మెల్ల" అనుకున్నారు బంధువులు.

ఇరవయ్యో రోజున సాయంత్రానికి వచ్చాడు గోపాలం. అందరి పరామర్శల్నీ అందుకున్నాడు. తన కూతుర్నిచూసి మురిసిపోయాడు. బారసాల జరిగిపోయింది.

ఆ రోజు రాత్రి మంజుల అడిగింది.

"అంతా, వద్దన్నారే అనుకోండి - మీరంత కోపం తెచ్చుకోవాలా!" ఎంత భయపడి చచ్చానను కున్నారు. అంతా, అసలు మీరు రారేమో అనుకున్నారు!"

మంజులని పరకాయించి చూశాడు గోపాలం. పచ్చి బాలింతరాలుగానే, మంజుల అందంగా వుందనుకున్నాడు.

"నాకేం కోపం రాలేదు మంజూ! కాని నువ్వేం కోపం తెచ్చుకోనంటే, ఓ విషయం చెబుతాను! చెప్పనా?"

పసిపిల్లకు పాలుపడుతూ, చెప్పమని తలవూపింది, మంజుల.

"మన మధ్యనే ఈ విషయం కొన్ని రోజులు రహస్యంగా వుండాలి సుమా!"

"ఏమిటండీ! అంతభయం!" కనుకనుబొమలు ముడిచి - నవ్వింది మంజుల.

"చెబుతున్నాను వి మంజూ! - నేను ఈ మధ్యనే ఆపరేషన్ చేయించుకున్నాను - పిల్లలు పుట్టకుండా! నీకు ఆపరేషన్ చేయించటానికి మనవాళ్ళెవరూ ఒప్పుకోవటంలేదు! - పైగా నీకూ ఏదో భయమేసింది! - ఆపరేషన్ చేయించుకోవటం వలననే పదకొండో రోజుకి రాలేకపోయాను. పైకి చెబితే అంతా ఫెరయిపోతారని - బయటకు పొక్కలేదు! ఈ రహస్యం కొన్నాళ్ళు నీలో నాలో మాత్రమే వుండాలిసుమా! - తరువాత నెమ్మదిగా తెలిసినా వాళ్ళే సరుకు పోతారు! ఏది ఏమైనా నీ కభ్యంతరం లేదన్నావ్ - నా కంతే చాలు - ఏ మంటావ్!" అడిగాడు గోపాలం - తన ఎదురుగా వున్న మంజుల మాతృత్వస్వరూపాన్ని చూస్తూ.

ముందు బిత్తరపోయినా, భర్త చేసిన పనికి - హాయిగా నవ్వేసింది మంజుల.

***